ప్రజాశక్తి

సోమవారం 12 డిసెంబర్ 2022 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

రైతు కష్టం వర్షార్పణం



నీటిలో మునిగిన మినప మొక్కలు

- 8,350 ఎకరాల్లో నీట మునిగిన వరి
- నేలవాలిన వేలాది ఎకరాల్లో పనలు
- ధాన్యం సేకరణకు ఆటంకంగా నిబంధనలు
- అపరాలకు నష్టం



తడిచిన పనలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మనోహరరావు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మాండూస్ తుఫాను కారణంగా జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతన్నలకు అపారనష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పనలు నీట మునిగాయి. జిల్లాలోని మొత్తం 30 వేల ఎకరాలు వరి కోతలు కోసి పనలపై ఉంది. ఆదివారం వ్యవసాయశాఖ సేకరించిన ప్రాథమిక నివేదికలో ఎనిమిది మండలాల్లో 8,350 ఎకరాలు మాత్రమే పనలపై ఉన్న వరి తడిచినట్లు ప్రిలిమినరీ నివేదిక సిద్ధం చేశారు. తుది నివేదికలో ఈ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు చోటు చేసుకునే అవకాశం ఉంది. అవనిగడ్డ మండలంలోని మూడు గ్రామాల్లో 60 ఎకరాలు తోట్లవల్లూరులోని 8 గ్రామాల్లో 375, ఘంటసాలలోని 20 గ్రామాల్లో 1625, నాగాయలంక మండలంలో 750, కోడూరులో 1650, చల్లపల్లిలో 1350, మోపిదేవిలో 1000 ఎకరాల్లో పనలు నీటిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈదురుగాలులకు వేలాది ఎకరాల్లో పంట నేలవాలింది. వరి మాగాణుల్లో వెదజల్లిన మినుము, పెసర మొక్కలు నీట మునిగాయి.

నిబంధనలు సడలిస్తేనే కొంత ఊరట

మూడు రోజులుగా వర్షాలకు కురుస్తుండటంతో కోత కోసి పనలపై ఉన్న పొలాల్లో వరి కంకులు మొలకలెత్తుతున్నాయి. వరి నీటిలో నానిపోవడంతో పనలు పోగేసే సమయంలో గింజలు రాలిపోతాయి. ఎకరానికి నాలుగు బస్తాల వరకు నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. కలుగుతుందని చెబుతున్నారు. ఏ గ్రేడ్, కామన్ రకం ధాన్యంలో 17 శాతం లోపు తేమ, వ్యర్థపదార్థాలు ఒకశాతం, చెత్త తాలూ ఒకశాతం, చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 3 శాతంలోపు, ఏ గ్రేడ్‌లో తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు (కేళీలు) 6 శాతం లోపు ఉంటేనే ధాన్యం సేకరణకు ప్రభుత్వ మద్దతు ధర ఇస్తోంది. వరి పనలు నీటిలో నానడంతో ఈ ప్రమాణాలను అనుసరించడం అసాధ్యమని రైతులు చెబుతున్నారు. తడిచిన వరి పనలు నూర్చే క్రమంలో ఎక్కువ మొత్తంలో గింజలు రంగు మారడంతోపాటు, తాలు, తప్ప, మట్టి పెళ్లలు, ఇతర వ్యర్థాలు ఎక్కువగా వస్తాయి. ధాన్యం సేకరణలో ప్రభుత్వ నిబంధనలను (మిగతా 6లో)



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

లక్షలాది కుటుంబాలకు జీవిత బీమా ఆసరా

ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ 54వ మహాసభల్లో ఎమ్మెల్యే రమేష్‌బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ

జీవిత బీమా సంస్థ ద్వారా తాము దాచుకున్న డబ్బు లక్షలాది కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మచిలీపట్నం డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఇయు) 54వ జనరల్ కాన్ఫరెన్స్ అవనిగడ్డలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ రూ.42 లక్షల కోట్ల ఆదాయంతో దేశంలోనే ఉన్నత స్థాయిలో కొనసాగుతున్న జీవిత బీమా సంస్థ అభివృద్ధికి ఆ సంస్థ ఉద్యోగులు, ఏజెంట్లే కారణమన్నారు. తద్వారా లక్షలాదిమంది జీవితాలకు ఆసరా కల్పించడంతోపాటు దేశానికి ఆర్థిక సహకారం అందిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు కొనసాగటానికి కారణభూతమయ్యారన్నారు. అలాంటి సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కుటుంబ భద్రతకు భరోసాగా నిలుస్తున్న జీవిత బీమా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్ మహాసభలు అవనిగడ్డలో నిర్వహించటం అభినంద నీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. యూనియన్ జోనల్ అధ్యక్షులు బి.సతీష్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర చరిత్రను ఒకసారి సమీక్షించుకోవాలని భారత దేశంలో ఇప్పుడు కొనసాగుతున్న పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసే (మిగతా 6లో)

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

రాష్ట్ర గృహ నిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్



బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి రమేష్

ప్రజాశక్తి-బంటుమిల్లి: రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని చెరువు వద్ద ఈనెల ఐదో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో కత్తివెన్ను మండలం నీలిపూడి గ్రామానికి చెందిన నలుగురు అయ్యప్ప భక్తులు బాడిత రమేష్ (35), బూడిశెట్టి పాండురంగారావు (33), బుద్ధన పవన్ కుమార్ (27), పాశం రాంబాబు (45), పి.శ్రీనివాసరావు మరణించారు. గాయపడిన 18 మందిలో నీలిపూడి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యారావు, నాగరాజు, పి.వరుణ్ సంతోష్, పి.కోదండరాం, గోవర్ధన్, ఆంజనేయులు, లాస్య, బొల్లిశెట్టి మావిల్లు, చంటి, రాంబాబు, నాగమణికంఠ, బాలాజీ, బాల పధ్వినాథ్, పి.సాంబశివరావు, పి ఆంజనేయులు, పి వెంకన్న, పి.భరత్ కుమార్, పి.శ్రీనివాసరావు ఉన్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే మంత్రి అధికారులను, పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సిఎంతో మాట్లాడి మరణించిన నలుగురి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. చెక్కులను ఆదివారం మంత్రి జోగి రమేష్ స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి, ధైర్యం చెప్పి అందజేశారు. బందర్ ఆర్డీవో ఐ.కిషోర్, కృత్తివెన్ను ఎంపీపీ కునసాని గరుడ ప్రసాద్, జెడ్పీటీసీ మైలా రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, సర్పంచ్ పాసం కృష్ణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పిన్నింటి మహేష్, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి రాజు, తహశీల్దార్ రామకోటేశ్వరరావు, వైసిపి కన్వీనర్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి





ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలోని వ్యక్తులందరికీ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించటమే ప్రధాన లక్ష్యమని కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి చెప్పారు. ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే...

ప్రశ్న: ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎలా ఉంటుంది?

జవాబు : దేశ చరిత్రలో తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తోంది. దీనిద్వారా గ్రామీణులకు స్థానికంగానే ఉచితంగా ఓపీ సేవలు, వైద్య పరీక్షలు, మందులు అందుతున్నాయి.

ప్ర: జిల్లాలో కొత్త విధానం అమలుకు కృషి జరుగుతుందా?

జ : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే ట్రయన్ రన్ నిర్వహించాం. నిర్వహించిన అన్ని ప్రాంతాల్లో విజయవంతమైంది. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. రాష్ట్రప్రభుత్వం ఈనెల 21 నుంచి అధికారికంగా అమలులోకి తీసుకురానుంది.

ప్ర : ఈ విధానం ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది?

జ : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చారన్నారు. ప్రాథమికంగా ప్రజలకు వైద్యసేవలను బలోపేతం చేయాలనీ, మెరుగైన సౌకర్యాలను ఏర్పాటుచేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ప్ర : ఫ్యామిలీ డాక్టర్ ఏ విధంగా పనిచేస్తారు?

జ : ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యాధికారి, మిగిలిన బృందం గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను నెలలో రెండుసార్లు సందర్శిస్తారు. అక్కడ్ ట్రీట్‌మెంట్‌తోపాటుగా ఆరోగ్య శ్రీ సేవలపైనా సమన్వయం చేస్తారు. ప్రాథమిక సేవల్లో భాగంగా ప్రతి 2000 మందికి ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ అందుబాటులో ఉంటుంది. అక్కడ 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయి. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో 2000 మందికి సేవలు అందిస్తారు. ప్రతి 5000 మంది జనాభాకు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ఓ ఎఎన్‌ఎం, ఒక ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒ), ఆశావర్కర్లు సేవలు అందిస్తారు. ఈ విలేజ్ క్లినిక్‌లలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి.

ప్ర: సమస్యలు ఏమైనా వస్తే ఎలా పరిష్కరిస్తారు?

జ : ఈ విలేజ్ క్లినిక్‌లలో అన్ని రకాల వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంటాయి. గ్రామస్థాయిలో నయంకాని ఆరోగ్య సమస్యలు ఉనన వారిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులను రెఫర్ చేస్తారు. చిన్నపిల్లలు, గర్భిణులకు కూడా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ విలేజ్ క్లినిక్‌లకు టెలీమెడిసిన్, టెలీ హబ్‌ల ద్వారా మెడికల్ ఆఫీసర్‌తోపాటు ప్రత్యేక సదుపాయాలు కూడా అందుబాటులోకి వస్తాయి. ఆ తర్వాత మెల్లిగా వైద్య సేవలను ఇంటికే అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. ఆశావర్కర్లు వైద్యం అవసరమైన వారిని గుర్తిస్తారు.రోగికి మందులతో పాటు మనమిచ్చే భారోసాతో తొందరగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.

ప్ర: క్షయవ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఏ విధంగా సహాయం అందిస్తుంది?

జ : ప్రభుత్వం నిక్షయ్ పోషణ (మిగతా 6లో)

జెవివి ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-భవానీపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ఆదివారం భవానీపురం నేతాజీ హైస్కూల్‌లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ హైస్కూల్ నందు జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో ప్రైవేటు పాఠశాలల విభాగంలో విజయవాడలోని అమలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఏ. నవీన్ ఆదర్శ్, సిహెచ్ వాత్సల్య, పి. తేజ రెడ్డి ప్రథమ స్థానంలోనూ, గౌతమ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, మైలవరం విద్యార్థులు బి. చరణ్ తేజ రెడ్డి, జి పూజిత, డి. భాను వేద సాయి ద్వితీయ స్థానంలోనూ, కొండపల్లి నాగార్జున హైస్కూల్‌కు విద్యార్థులు ఎస్.కె అబ్దుల్ సమద్, ఎల్. శ్రీరామ్ కుమార్, ఎస్.డి. ముస్తారి నీలోఫర్ తతీయ స్థానంలోనూ నిలిచి విజయం సాధించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ హైస్కూల్ కంభంపాడు విద్యార్థులు చెన్ను శ్యామ్ కష్ణ, చిమట అనిల్ కుమార్, జి రాకేష్ ప్రథమ స్థానంలోనూ, జిల్లా పరిషత్ హైస్కూల్, ఏ కొండూరు విద్యార్థులు కే. ఉపేంద్ర, పి. రాజేష్, జే. భాస్కరరావు ద్వితీయ స్థానంలోనూ, విజయవాడ జీడి ఈటి మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జి. సాయి దీపక్, పి. యశ్వంత్ కుమార్, ఎం. మనోజ్ కుమార్ తతీయ స్థానంలోనూ నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ చేకూరి మురళి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల జిజ్ఞాసను పెంచుకోవాలని, అన్ని విషయాలపై సమగ్ర అవగాహన కోసం ప్రయత్నించాలని తెలియజేశారు. కష్టపడి నేర్చుకుంటేనే అన్ని విషయాలపై అవగాహన వస్తుందని చెప్పారు. సైన్స్ నేర్చుకోవడంతో పాటు శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్‌రావు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని, ఈ టెస్టులో పాల్గొన్న అనేకమంది విద్యార్థులు నేడు సమాజంలో ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలియజేశారు. చెకుముకి సైన్స్ సంబరాలు నాలుగు దశల్లో జరుగుతాయని ఈరోజు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన రెండు టీములు జనవరి మొదటి వారంలో కడపలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని తెలియజేశారు. ఈ సభకు జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్షులు వి, శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నగర గౌరవాధ్యక్షులు ఏ. మోహన్ రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెలగా శ్రీనివాస్, జిల్లా చెకుముకి కన్వీనర్ ఎస్. కే. ఇమామ్, జిల్లా మరియు నగర నాయకులు పి.ఆర్.కె. రెడ్డి, వి.మురళీమోహన్, మల్లికార్జున్ రెడ్డి, నేతాజీ హైస్కూల్ అధినేత కె.తిరుపతిరెడ్డి, గాంధీ ఫౌండేషన్ నాయకులు శివరంజని తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు.


విజేతలతో జనవిజ్ఞాన వేదిక నాయకులు


జెండా ఊపి రన్ ప్రారంభిస్తున్న సిప క్రాంతిరాణా టాటా

ఆరోగ్యంపై అవగాహన అవసరం

● సిపి క్రాంతి రాణాటాటా ● ఉత్సాహంగా గుడ్ హెల్త్ రన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో మణిపాల్ హాస్పటల్స్ ఆధ్వర్యాన గుడ్ హెల్త్ రన్ నిర్వహించారు. విజయవాడలోని బిఆర్‌టిఎస్ రోడ్డులో నిర్వహించిన ఈ రన్‌ను ఆదివారం నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రాణాటాటా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా మణిపాల్ హాస్పటల్స్ ఇటువంటి రన్ నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాక్షించారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ప్రస్తుత వేగవంతమైన జీనవ విధానంలో మన ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మణిపాల్ హాస్పటల్స్ చక్కటి వైద్యం అందించంతోపాటు నగర వాసులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు ఇటువంటి రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మణిపాల్ హాస్పటల్స్ విజయవాడ యూనిట్ హెడ్ కంటిపూడి సుధాకర్ మాట్లాడుతూ తమ హాస్పటల్ ఆధ్వర్యంలో రెండో సారి గుడ్‌హెల్త్ రన్ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 10కె వాక్, 5కె వాక్ నిర్వహించినట్లు తెలిపారు.

శ్రీవాహిని కళాశాలలో 'గార్డెన్ పార్టీ'

ప్రజాశక్తి - తిరువూరు : స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆ ధ్వర్యంలో ఆదివారం గార్డెన్ పార్టీ జరి గింది. సిబ్బంది ఆటపాటలతో అలరిం చారు. ఇలాంటి కార్యక్రమాలు మాన సిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతా యని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. నాగేంద్రబాబు తెలియజేశారు. ఈసం దర్భంగా అధ్యాపకులకు, సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహించి గెలుపొంది న వారికి బహుమతులు ప్రధానం చే శారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మ న్ పసుమర్తి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-మైలవరం : తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మైలవరం మార్కెట్ యార్డ్ లో తడిసిన ధాన్యాన్ని ఆదివారం పరిశీలించారు. పట్టాలు కూడా ఇవ్వటం లేదని వాపోయారు. అనంతరం తడిసిన ధాన్యాన్ని తీసుకొని రైతులతో కలిసి బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి లో ఉన్న సీఎం జగన్ కళ్ళు తెరిచి రైతుల పడే కష్టాలు చూడాలన్నారు. రైతుల పట్ల జగన్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని నిరసనను విరమించాలని సూచించిన, విరమించకపోవడంతో పోలీసులు దేవుని నువ్వు మన అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు. తరలించారు.

జీతాలు రాక ఉద్యోగుల ఇబ్బందులు : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులు సమయానికి జీతాలు పడక ఇబ్బంది పడుతున్నారని మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు.జగ్గయ్యపేటలో ఆదివారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు సమయానికి జీతాలు పడక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఎవరైనా ప్రభుత్వ వ్యతిరేకంగా మాట్లాడితే వారిని టార్గెట్ చేస్తూ చాలా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్లు రాక వాళ్ళ బాధ వర్ణనాతీతంగా ఉందన్నారు. ఉద్యోగుల పట్ల ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం వారి సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు.

నేల వాలిన వరి పంట

● మిర్చి పంట తడవకుండా రైతుల హడావుడి

ప్రజాశక్తి-కంచికచర్ల : బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాన్ ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం మూడవ రోజు కూడా జల్లులు కురిశాయి. శనివారం రాత్రి విజయవాడ, నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, మైలవరం ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి సమయంలో ఈదురు గాలులు వీశాయి. ఆదివారం తెల్లవారుజామున జిల్లా అంతటా ఓ మోస్తరు వర్షం కురిసింది. మూడు రోజులుగా మంగు వాతావరణం తో పాటు, జల్లులు కురుస్తుండటంతో కోయాల్సిన వరి పంట చేతికి రాకుండా పోతుందేమోనని రైతులు ఆందోళనకు గురౌతున్నారు. శనివారం, ఆదివారం వీసిన ఈదురు గాలులకు పరిటాల, చెవిటికల్లు, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, వత్సవాయి, చందర్లపాడు తదితర ప్రాంతాల్లో కోయాల్సిన వరి పంట నేల వాలింది. ముసురు తగ్గకుండా ఇలాగే ఉంటే గింజలు రాలిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో కోసి కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంట తడవకుండా రైతులు హడావుడిగా పట్టాలు కప్పుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు చల్లటి ఈదురు గాలులు వీశాయి. వాతావరణం ఇలాగే ఉంటే చేతిదాకా వచ్చిన పంటలు ఏమౌతాయోనని రైతులు లబోదిబో మంటున్నారు.

విద్యుత్ పరికరాలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండూస్ తుఫాన్ వలన కురుస్తున్న వర్షాల, గాలుల వల్ల అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ శాఖ ఏ ఇ తారాచంద్ ఓ ప్రకటనలో తెలిపారు. స్తంబాలు పడిపోవచ్చుని, వైర్స్ తెగిపోవచ్చుని కావున వాటిని ముట్టుకొనే ప్రయత్నం కాని, దగ్గరకు వెళ్లే ప్రయత్నం కాని చేయవద్దని కోరారు. ఇంటికి సంబందించిన సర్వీస్ వైర్లని కాని, వాటితో వెలాడే ఇనుప తీగలను కానీ, కరెంట్ స్తంభాలను కానీ, ఇనుప స్తంభాలను కానీ, లైన్స్ మీద చెట్టు కొమ్మలు పడిన కానీ, ముట్టుకొనే ప్రయత్నం చేయవద్దన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య వుంటే లోకల్ లైన్ ఇన్స్పెక్టర్ కు కానీ, 1912 కు ఫోన్ చేయాలన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-వీరులపాడు

మండలంలో వి అన్నవరం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తుల్ని అదుపులో తీసుకున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం తెలియటంతో దాడి చేసి నలుగురు అదుపులో వారి వద్ద 4 070 రూపాయలు తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని మంగోల్లు సొసైటీలో రుణం తీసుకొని సహజ మరణం పొందిన దేశపాలెం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ సాహెబ్ కుటుంబానికి ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన లక్ష రూపాయల చెక్కును స్థానిక శాసనసభ్యులు సా మినేని ఉదయభాను అందజేశారు. పట్టణంలోని కెడిసిసి బ్యాంకు వద్ద జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, మంగలి సొసైటీ అధ్యక్షులు సామినేని లక్ష్మీనారాయణ, వైయస్సార్సీపి పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, సర్పంచి అన్నపాక నరసింహారావు పాల్గొన్నారు

అజ్మీర్ యాత్రకు తరలిన నాయకులు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామలోని చందాపురం బైపాస్ వద్ద బలే షా మస్తాన్ వలీ బాబా దర్గా వద్ద ఆదివారం నందిగామ పట్టణం మూడవ వార్డు నుంచి అజ్మీర్ యాత్రకు పట్టణానికి చెందిన కౌన్సిలర్లు, మైనారిటీ నేతలు మరియు తెదేపా నేతలతో కలిసి బాలేషా మస్తాన్ వలీ బాబా దర్గాలో ప్రత్యేక పూజలలో పాల్గొని అజ్మీర్ యాత్రకు బయలుదేరి వెళ్ళారు. అజ్మీరు యాత్రకు వెళ్ళే వారి కి మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైనారిటీ వారిని అట్టడుగుకు అణచివేయడం జరిగిందన్నారు. పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు మద్దతు ధరేది?

● మార్క్‌ఫెడ్ కేంద్రాలు తెరవక రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ డివిజన్లో మొక్కజొన్న పంట మద్దతు ధర కంటే ఎక్కువ ధరకే కొనుగోళ్ళు చేసినా గత రబీ సీజన్ తో పోలిస్తే క్వింటాకు 400 ధర తగ్గించటంతో రైతులు నష్టపోతున్నారు. బహిరంగ మార్కెట్ లో మొక్కజొన్నకు డిమాండ్ పెరిగింది. నందిగామ డివిజన్లో మొక్కజొన్న పంట ఈ ఏడాది ఖరీఫ్లో సుమారు ఏడు వేల యకరాలలో సాగు చేశారు. నూర్పిడిలు మమ్మురంగా సాగుతున్నాయి. మార్కెట్ కమిటీలో మార్కుఫెడ్ కొనుగోలు కేంద్రాలు తెరవక ముందే క్వింటా 2 వేలకు దళారులు రైతుల వద్ద కొంటున్నారు.గత రబీ క్వింటా 2400 కు రైతుల వద్ద కొనుగోలు చేశారు. నందిగామ ప్రాంతంలో అల్క్ హాల్ పరిశ్రమలు ,కోళ్ళ దాణా,అల్క్ హాల్ తయిరికీ మొక్కజొన్న ఎక్కువగా వాడుతున్నారు. దళారులు పరిశ్రమలకు అమ్మి లాభపడుతున్నారు. 2022-23లో ప్రభుత్వం మద్దతు ధర రూ.1962 ప్రకటించింది. మద్దతు ధర కంటే కొంచెం పెంచి కొంటున్నారు.తక్షణమే మార్కుఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ లో కంటే రబీలో ఎక్కువ విస్తీర్ణంలో మొక్క జొన్న సాగు చేస్తున్నారు. ఖరీఫ్లో దిగుబడులు విక్రయించిన రైతులు రబీలో ఇదే పంట సాగుకు సిద్ధమవుతున్నారు. వరి కోతల తర్వాత రెండో పంటగా రైతులు మొక్కజొన్న సాగు చేస్తారు. సగటున 25 క్వింటాళ్ళు దిగుబడి వస్తోంది. గత రబీలో మొక్కజొన్న ఇతర దేశాలకు ఎగుమతులు చేయడంతో మద్దతు ధర కంటే ఎక్కువ కు కొనుగోలు చేశారు. మార్కుఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే దళారులు ధర పెంచే అవకాశం ఉంది.



మొక్కజొన్న పంట మద్దతు ధర పెంచాలి

గర్మిడి నరసింహారావు

మొక్కజొన్న పంట మద్దతు ధర పెంచటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తక్కెళ్ళపాడు గ్రామ రైతు గర్మిడి నరసింహారావు తెలిపారు.దళారులు రైతులను నిలువునా దోచుకుంటూ మోసం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర పెంచాలి.మార్కుఫెడ్ కేంధ్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలి.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి

ఎఎంసి కార్యదర్శి శ్రీనివాసరావు

నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కు కసి చేస్తామని నందిగామ ఎఎంసి కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే బహింగంగా ఎక్కువగా ధర ఉండటంతో రైతులు బయట అమ్ముకుంటున్నారని ,ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్ళి మొక్కజొన్న పంట మద్దతు ధర పెంచటానికి కషి చేస్తామని తెలిపారు.

కళ్లాల్లోనే వరి పంట

- కొన్నిచోట్ల పూర్తికాని కోతలు
- వర్షాలు కురిస్తే నష్టమే అంటున్న రైతులు

ప్రజాశక్తి-గన్నవరం : రైతులను మాండస్ తుఫాను భయం వెంటాడుతోంది. కళ్లాల్లో వరి పంట ఉండటంతో వారి గుండెల్లో తుఫాన్ రైళ్లు పరుగెట్టిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన మాండస్ తీవ్ర తుఫానుగా మారటంతో ఆ ప్రభావం గన్నవరం లో కూడా కనిపిస్తోంది. శనివారం నుంచి వాతావ రణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. చిరుజల్లులు ప్రారంభమై రాత్రి సమయానికి జోరువానలు ప్రారంభమయ్యాయి. దీంతో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. గన్నవరం ప్రాంతంలో 25 వేల ఎకరాల్లో వరిసాగయింది. వరి కోతలు ఇంకా పూర్తి కాలేదు. చాలా ప్రాంతాల్లో వరి పంట కల్లాల్లోనే ఉంది. ధాన్యం తడిసి పోతే నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇదీగాక కొన్ని ప్రాంతాల్లో కోసిన వరి ధాన్యం కొనుగోళ్ళు పూర్తికాక పోవటంతో వారిలో మరింత ఆందోళన కనిపి స్తోంది. ముస్తాబాద్, వీరపనేని గూడెం, చిక్కవరం, బుద్ధవరం, సావరగూడెం, దావాజీగూడెం, బూతిమిల్లిపాడు, కేసరపల్లి తదితర ప్రాంతాల్లో వరి కోతలు ఇంకా పూర్తి కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాను నేప?థ్యంలో పంటను రక్షించుకోవాలని ఇప్పటికే వ్యవసాయ శాఖాధి కారులు సూచనలు చేస్తున్నారు.

విపరీతమైన చలిగాలులు : తుఫాను వాతావరణం కారణంగా చలిగాలులు తీవ్రంగా వీస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు వెళ్లా లంటేనే భయపడుతున్నారు. తుఫాను ప్రభావం శని, ఆదివారాల్లో ఎక్కువగా ఉండటంతో రైతులలో మరింత ఆందోళన మొదలైంది. గడచిన 24 గంటల్లో గన్నవరం మండలంలో 3.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. తుఫాను నేపథ్యంలో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. సాయంత్రం 4 గంటల నుంచే చలిగాలుల తీవ్రత ప్రారంభమైంది. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలు సెంటీగ్రేడ్ వరకు చేరుతున్నా అంతకన్నా ఎక్కువగానే చలి ప్రభావం కనిపిస్తుందని



రోడ్డుపై ఆరా పోసిన ధాన్యం

చెబుతున్నారు. చలి ప్రభావం కారణంగా కొంతమంది అనారోగ్యాల పాలవుతున్నారు. జలుబు, జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రులకు వెళుతున్నారు. ఈ వాతావరణంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగవద్దని వైద్యులు చెబుతున్నారు.



వరి పనలను పరిశీలిస్తున్న అధికారి మనోహర్

వరిపొలాల పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి

వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్విఎస్ మనోహర్ ఆదివారం మండల పరిధిలోని కొత్త మాజేరులో పర్యటించి మాండూస్ తుఫాన్ కారణంగా నీటి మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పంట పొలాలలో అదనంగా నీళ్ల నిలువ ఉంటే చిన్న చిన్న చిళ్లుగా డ్రైనేజీ చానల్స్ ఏర్పాటు చేసి నీ రు బయటకు వెళ్లే విధంగా రైతులకు ఆయన సూచించారు. పైరు పనుల మీద తడిస్తే ఉప్పునీటి ద్రావణంలో కంకులు ముంచి ఆరబెట్టి చిన్న కుప్పలుగా వేయాలి అన్నారు. ఎకరానికి 10 కిలోల ఉప్పు అవసరం అవుతుందని, ఇలా చేయటం వల్ల పది పదిహేను రోజు వరకు పంటకు నష్టం వాటిల్లదని వివరించారు. రాయితీపై విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరగా ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయాధికారిణి జి సాయి సింధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి కోడూరు** : కోడూరు మండలంలో మాండోస్ తుఫాన్ వలన దెబ్బతిన్న పొలాలను మండల వ్యవసాయ అధికారి, ఎన్ భాను ప్రకాష్ పరిశీలించారు. ముఖ్యంగా రైతులు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వరి పనల మీద నీరు నిలబడటం వల్ల పంట నాణ్యత తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రైతులు పంట పొలాల్లో ఉన్న నీటిని చిన్న ,చిన్న కాలువల ద్వారా బయటికి మళ్లించాలన్నారు. నీరు పొలంలో నుంచి బయటికి వెళ్లిన తర్వాత ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనల మీద మనం పిచికారి చేసుకున్నట్లయితే మొలక రాకుండా జాగ్రత్త పడవచ్చున్నారు.

నీటమునిగిన పంటపొలాలు



చల్లపల్లిలో...



మోపిదేవిలో..

ప్రజాశక్తి-చల్లపల్లి : అప్పులు చేసి రెక్కలు ముక్కలు చేసుకుని ఆరు కాలం పండించిన పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు రావటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు రాయితీ విత్తనాలు, ఎరువులు ఇవ్వకపోయినా బ్యాంకు రుణాలు అందకపోయినా ప్రైవేటు వ్యాపారుల నుండి నుండి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు పండిస్తే చేతికి వచ్చే సమయానికి మాండూస్ తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలలో పనులు నీటిలో నానటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెచ్చిన రుణాలు ఎలా తీర్చాలని వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి రాక చేతి కందిన పంట నీటిలో నానటంతో ధాన్యానికి గిట్టుబాటు ధర వస్తుందా అని అన్నదాతలు మదన చెందుతున్నారు. కొంత పొలంలో కుప్పలు వేయగా మరికొందరు కోత కోశారు. నిలబడి ఉన్న పొలంలో చల్లిన విత్తనాలు ఇప్పటికే మొలకెత్తేయని, అవి ఎందుకు పనికిరాని బాధపడుతున్నారు. కౌలు రైతులు క్వింటాలు పదివేల రూపాయలకు విత్తనాలు కొని చలినట్లు తెలిపారు. ఇప్పటికే అధిక రేట్లతో కోతలు కోయించిన రైతులు పంట పొలాలలో వరి పనులు నీటిలో ఉన్నాయని అన్నారు. వరి పంటలో నేను చేరటం వలన ధాన్యం గింజ నాణ్యత తగ్గుతుందని అన్నారు. కోత కోయని పొలాలలో మరలా విత్తనాలు జల్లేందుకు రాయితీ విత్తనాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా ప్రభుత్వమే నేరుగా ఆర్‌బి కేల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

వర్షంతో వరి, కూరగాయ పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి మోపిదేవి : మండుస్ తుఫాను కారణంగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోతలు కోసిన వరి పంట పనుల మీద తడిసి నీటిలో తేలి ఆడుతున్న పరిస్థితి మండలంలోని మోపిదేవి, పెదప్రోలు, కోకిలి గడ్డ, తదితర గ్రామాల్లో నెలకొని ఉంది. అదేవిధంగా ఉద్యానవన పంటలైన టమాట, బీర, మిర్చి తదితర కూరగాయ పంటలు భారీ వర్షానికి నీట మునిగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి నెలకొని ఉంది. మండలంలో వరి రైతులతోపాటు, కూరగాయ పంటలు వేసిన రైతులు సైతం తీవ్ర నిరాశని స్పృహలతో ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం కూరగాయ పంటలకు పంట నష్టం అంచనాలు రూపొందించి, ప్రభుత్వ సహాయం అందజేయాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా వరి కోతలు కోసిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం అందజేయాలని వరి పంట వేసి కోతలు కోసిన రైతులు తమ ఆవేదన తెలియజేస్తున్నారు. మరి కొద్ది మంది వరి పంట వేసిన రైతులు యంత్రాల సాయంత్రం తో వరి కోతలు కోసి తమ వడ్లను రహదారుల వెంట గొట్టలుగా చేసి దిక్కుతోచని స్థితిలో తన ధాన్యపు రాసులకు కాపలాగా ఉంటున్నారు. ధాన్యపురాసులు ఉన్న రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం షరతులు ఉపసంహరించుకొని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతుల కోరుతున్నారు.



నష్టపరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి-కోడూరు : మాండోస్ తుఫాన్‌కి కోడూరు మండలంలో దెబ్బతిన్న పంట పొలాలకు వెంటనే నష్టపరిహారం అందించేందుకు కషి చేయాలని కోడూరు మండల తాసిల్దార్ ఎస్ కే లతీఫ్ పాషాని మాజీ జడ్పిటిసి బండే శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ కారణంగా వేల ఎకరాలలో కోత కోసిన వరిపైరు నీట మునగటం బాధాకరమని అన్నారు. వెంటనే డ్రైనేజీ సంబంధిత అధికారులు స్పందించి పంట పొలాలలో నీరు బయటకు పోయే విధంగా మురుగు కాలవలు బాగు చేసి రైతుల్ని ఆదుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో ఆదివారం పేదలకు అన్నదానం, మధుమేహ వ్యాధి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగ్ శెట్టి ఆదినారాయణ తెలిపారు. వల్లభనేని వీరభద్రరావు జన్మదినం సందర్భంగా వారి కుటుంబ సహకారంతో వందమంది అన్నదానం నిర్వహించారు. అలాగే మధుమేహ వ్యాధి రోగులకు డాక్టర్ రజిని 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న కారు: మహిళ దుర్మరణం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : హైదరాబాద్ నుండి రామచం ద్రపురం వెళ్తున్న కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడిక్కడే దుర్మరణం చెందిన ఘటన బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి ఈస్ట్ గోదావరి జిల్లా రామచంద్రపురం దగ్గర రేలంగికు నెర్ల రాణి (57), గొడవర్తి వాసులు, ఇద్దరు చిన్నపిల్లలు కారులో వెళుతుండగా బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురం వద్దకు రాగానే కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈప్రమాదంలో రాణి అక్కడికక్కడే మృతిచెందగా, గొడవర్తి వాసు, చిన్నపిల్లలకు గాయాలయ్యాయి. వీరవల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీరవల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం. తెలియచేశారు.



పేకాటరాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని తాడిచెర్ల గ్రామంలో కోడిపందాల శిబిరాల పై గుడ్లవల్లేరు ఎస్సై వి ఏసేబు ఆదివారం దాడులు నిర్వహించారు. కోడి పందాలు నిర్వహిస్తున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద 296 కత్తులను మరియు 2130 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : గన్నవరం మండలం గొల్లనపల్లి, చిక్కవరం గ్రామాల్లో ఏడుగురు పేకాటరాయుళ్ళ ను అరెస్టు చేసి రూ.4200 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రమేష్ బాబు తెలిపారు. మెట్ట గ్రామాలలో ఎక్కడైనా రహస్యంగా పేకాటలు పెడితే ఊరుకునేది లేదని చెప్పారు.

18, 19 తేదీల్లో గన్నవరంలో సిఐటియు జిల్లా మహాసభలు

- సిఐటియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై. నరసింహారావు

ప్రజాశక్తి-గన్నవరం : కార్మిక పోరాటాలకు పురిటి గడ్డ అయిన గన్నవరంలో ఈనెల 18,19 తేదీల్లో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) కృష్ణాజిల్లా 11 వ మహాసభలు భారీ ఎత్తున జరగనున్నాయని, జిల్లా నలుమూలల నుండి వేలాదిగా కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై. నరసింహారావు తెలిపారు. ఆదివారం గన్నవరంలోని సంఘ కార్యాలయంలో జరిగిన ప్రజాసంఘాల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఐటియు 1970 లో ఏర్పడిన నాటి నుండి కార్మిక , ఉద్యోగ పక్షపాతిగానే పని చేస్తున్నదన్నారు. కార్మిక, ఉద్యోగుల చట్టాలను రద్దు ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్ ప్రయత్నాలు చేస్తున్నదని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ హక్కులను హరిస్తున్నదని ఉన్నారు. కార్మికులకు ఉన్న హక్కులు హరిస్తున్న బిజెపి ప్రజల సంపదలైన కార్పొరేట్ కుబేరుల (ఆదాని, అంబానీ) కు కారుచౌకగా కట్టబెడుతోందన్నారు. దేశంలోని అన్ని కార్మిక సంఘాలను ఒక వేదిక పైకి తెచ్చి దేశాన్ని కాపాడేందుకు సిఐటియు ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలోనూ, కృష్ణా జిల్లాలోనూ పెద్ద ఎత్తున కార్మికుల పక్షాన ఉద్యమాలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం ప్రాంతంలో కూడా ఈ పోరాటాలన్ని జరిగాయన్నారు. పెద్ద నోట్ల రద్దు , జిఎస్టి అమలు , డీజిల్ ధర పెంపుదల వలన దేశీయ చిన్న , మధ్య తరహా పరిశ్రమలు అన్ని కుదేల య్యాయి కార్మికులకు ఉన్న ఉపాధి పోతుందన్నారు. కొత్త ఉపాధి తగ్గుతున్నదన్నారు. ఈ నేపథ్యంలో గన్నవరంలో జరుగుతున్న సిఐటియు జిల్లా 11వ మహాసభలకు ప్రత్యేకత ఉందన్నారు. ఈ మహాసభలకు మన జిల్లాలోని 25 మండలాల నుండి అనేక రంగాల నుండి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని, డిసెంబర్ 18 తేదీన సాయంత్రం వేలాది మందితో ప్రదర్శన , బహిరంగ సభ కూడా జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం. ఆంజనేయులు, ఐలు నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మరియదాసు పాల్గొన్నారు.


రుద్రరాజుకు ఆశీర్వచనం చేస్తున్న ఆలయ వేదపండితులు

దుర్గమ్మను దర్శించుకున్న రుద్రరాజు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు (ఏపిసిసి) నూతన అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, నగర అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావులు ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా అహ్వానించి అమ్మవారి దర్శనం చేయించారు. తదనంతరం వేద పండితులు దీవెనలతో అమ్మవారి ఆశీర్వచనాలు అందుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి అమ్మవారి ప్రసాదం అందజేశారు.



అమ్మవారి ఆఖండ జ్యోతుల ఊరేగింపు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవాని దీక్షల సంద ర్భంగా ఆదివారం కొత్తపేట బావి పంపులు సెంటర్ వద్ద అమ్మవారి అఖండ జ్యోతిల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అడ్డురి రామచంద్రరావు గురుభవానీ ఆశీస్సులతో వారి కుమారుడు అడ్డురి జానకి మల్లేశ్వరరావు భవానీ జ్యోతుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్, 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించి జ్యోతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవానీలు, అయ్యప్పలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

తోసా ఆధ్వర్యంలో 'రన్ ఫర్ హెల్త్'

ప్రజాశక్తి -తిరువూరు : తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) అధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఉదయం త్రీకె రన్ నిర్వహించారు. ముందుగా చీరాల సెంటర్ లో రన్ పర్ హెల్త్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొక్కి లిగడ్డ రక్షణనిధి ప్రారంభించారు. ప్రజల్లో ఆరోగ్యానికి సంబంధించిన అవగా హనను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. తోసా అధ్వర్యంలో ఇప్పటికే అనేకానేక మంచి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆరోగ్యం కొరకు రన్నింగ్, వాకింగ్, వ్యాయామాలు తప్పకుండా చేయాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్య జీవితం మన సొంతం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం పట్ట ణంలో రన్ నిర్వహించారు. ఈకార్యక్ర మంలో తోసా గౌరవ అధ్యక్షుడు కల కొండ రవికుమార్, సభ్యులు ఖంభం శ్రీనివాసరావు, రహీమ్, సతీష్, కె.రవి, నాళ్ళ ఖాశీ, చెన్నకేశవరావు తదిత రులు పాల్గొన్నారు.

సిఐటియు కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-మైలవరం : హక్కులు సమస్యల సాధనకై ఈనెల 12వ తేదీన జి కొండూరులో జరిగే సిఐటియు ఏడవ మండల మహాసభను సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం జి కొండూరు గేల్ కంపెనీ ఎదురుగా ఆటో స్టాండ్ ముందు కరపత్రాలను ఆవిష్కరించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కాల్ రాస్తున్నాయని తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కె బాలకష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ కోశాధికారి సిహెచ్ సదాశివరావు పాల్గొన్నారు



బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కంచికచర్ల, నందిగామ

బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ కంచికచర్ల, నందిగామలో ఆదివారంనాడు ఆయన పర్యటించారు. తొలుత కంచికచర్లలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభారతి, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలూ నాయక్, , జాయింట్ కలెక్టర్ వి.శ్రీధర్, నందిగామ ఎడిఎ రమణ మూర్తి, తదితరులు స్వాగతం పలికారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం వాతావరణ పరిస్థితులను బట్టి సాగు చేసిన పంటలకు చేపట్టాల్సిన చర్యల గురించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి, తద్వారా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. సేంద్రియ వ్యవసాయ విధానం, వ్యవసాయ యాంత్రీకరణ, కూరగాయల సాగు, పూలతోటల పెంపకం, పశు పోషకులకు ప్రభుత్వం అందించే రాయితీలు, ఆక్వా సాగు తదితర వాటి గురించి వివరించారు. అనంతరం ఆర్‌బికె కేంద్రాన్ని గారెత్ విన్ ఓవెన్ పరిశీలించారు. గతంలో మండల స్థాయిలో మాత్రమే సమాచారం ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం గ్రామ స్థాయిలో ప్రతి 1500 మంది రైతుల సమాచారం, పంటల సాగు వివరాల నమోదు, వాతావరణ పరిస్థితులను బట్టి సూచనలు, దిగుబడి వచ్చిన పంటలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకునేందుకు అనుమతులు, సబ్సిడీ, ఇన్సూరెన్స్, తదితర సదుపాయాలను సకాలంలో అందించేందుకు ఆర్బికెలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, అధికారులు వివరించారు. ప్రస్తుత సీజన్లో రైతులు పండించిన పంటలకు బహిరంగ మార్కెట్లో కన్నా, ఎంఎస్‌పి ధర ఎక్కువగా ఉందన్నారు. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతంలో వాణిజ్య పంటగా పత్తి, మిర్చి పంటలతో పాటు, వరి, మొక్కజొన్న, పెసర, మినుము, కంది, కూరగాయ పంటలు పండించే విధానం గురించి వివరించారు. ఆర్బికెల ద్వారా ఈ క్రాఫ్ ఆన్‌లైన్‌లో నమోదు, ప్రతి రైతుకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయడమే కాకుండా రాష్ట్ర కేంద్రానికి అనుసంధానం చేసిన తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి నీలిమ, పశుసంవర్ధక శాఖ ఎడి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వి.రాజకుమారి, ఎంపిడిఒ కె.బాల శంకరరావు, వ్యవసాయ అధికారి విజయకుమార్, కంచికచర్ల, పరిటాల సర్పంచ్‌లు వేల్పుల సునీత, యద్ధనపూడి ఆనంద జ్యోత్స్న, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, నందిగామ రూరల్ సిఐ ఐవి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గారెత్ విన్ ఓవెన్‌ను ఘనంగా సత్కరించారు.


కంచికచర్లలో 'పొలంబడి ' గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే


నందిగామలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ వద్ద హైకమిషనర్

నందిగామలో అగ్రీ టెస్టింగ్ ల్యాబ్ పరిశీలన

నందిగామలో అగ్రీ టెస్టింగ్ ల్యాబ్ ను బ్రిటన్ డిప్యూటీ కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పరిశీలించారు. నందిగామ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పనితీరును బ్రిటన్ కమిషనర్ కు నందిగామ ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు ,అగ్రికల్చర్ ఏడి రమణమూర్తి వివరించారు. ఆర్‌బికే కేంద్రాల పనితీరు చాలా బాగుందని, మా దేశంలో కూడా ఇలాంటివి ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని బ్రిటన్ డిప్యూటీ అన్నారు. ఎంఎల్‌ఎతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి -తిరువూరు

విస్సన్నపేట మండలం, తాతకుంట్ల గ్రామంలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించిన తిరువూరు నియోజక వర్గ శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణ నిధికి సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పలు సమస్యలపై వినతిపత్రం అంద జేశారు. విస్స న్నపేట నుండి తాతకుంట్ల, మెట్ట గూడెం, మారేమండ, గౌరంపాలెం గ్రామాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, అటవీ భూమి సాగుదారులకు పట్టాలివ్వాలని, పేరా భత్తుల దళితపేటలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకు కాలనీ ఇళ్లు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు సిపిఎం, విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, గ్రామ శాఖ కార్యదర్శి గద్దల రాము, మండల కమిటీ సభ్యులు రామకష్ణ, గౌరంపా లెం శాఖ కార్యదర్శి కోలేటి రమేష్ పా ల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించార ని నాగరాజు తెలిపారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నేడు, రేపు రాయనపాడు రైల్వే క్రాసింగ్ గేటు మూసివేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

విజయవాడరూరల్ మండలం రాయనపాడు రైల్వే ట్రాక్ నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా కొండపల్లి రాయనపాడు మధ్యలోని 147నంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటును రెండు రోజులపాటు తాత్కలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 12 ఉదయం 8 నుండి 13 సాయంత్రం 6 వరకు గేటు మూసివేయనున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే స్థానికులు ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయో గించుకోవాలని అధికారులు సూచించారు.


డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఎంపి నందిగం సురేష్

ఎలీషాకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మోగులూరి ఎలీషాకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ డాక్టరేట్‌ను విజయవాడ హెూటల్ ఫార్ట్యూన్ గ్రౌండ్ హెూటల్‌లో అంతర్జాతీయ మానవ హక్కుల ది నోత్సవం రోజున జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘణకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం కోసం కోర్టులతో పాటు మానవ హక్కుల కషన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హ్యూమన్‌రైట్స్ నేషనల్ చైర్మన్ హైకోర్టు న్యాయవాది రాజు మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న మానవులు అంతా ఒక్కటే అని ప్రతి ఒక్కరికీ సహజ సిద్ధమైన గౌరవం సమానమైన శాశ్వతమైన హక్కులు ఉన్నాయన్నారు. హ్యూయన్‌రైట్స్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ జాతి వర్ణ లింగ కుల మత రాజకీయ వివక్షకు గురికాకుండా మానవ హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ నాయకులు రాజు శ్యాముల్ కిరణ్ పాల్ సాంసన్ తుమ్మల సత్యం తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న దృశ్యం

క్షీరబంధు చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- మైలవరం : బికొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘ సభ్యులకు ఆదివారం క్షీర బందు చెక్కును కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు అప్పిడి సాంబిరెడ్డి అందజేశారు. కొత్తగూడెం గ్రామానికి చెందిన కాసిముల నాగులు ఈనెల 11వ తేదీన చనిపోయారు. సహకార సంఘ సభ్యుడై ఉన్నందున కష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి విజయవాడ వారు క్షీర బందు పథకం కింద మంజూరైన 50 వేల రూపాయలు చెక్కును నాగుల భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం క్లస్టర్ మేనేజర్ కోట ప్రసాదు వేతన కార్యదర్శి వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని రైతు సంఘం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం రెడ్డిగూడెం అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఎం మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయని, వరి పంట ఆరే పరిస్థితి కనపడటం లేదని, కనుక ప్రభుత్వం పచ్చిగా ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. తుఫాను కారణంగా వరి, మామిడి, పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉండదని కనుక ప్రభుత్వమే ధాన్యం కొనుగోలను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉండదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మీరు కష్ణారెడ్డి బల్లరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కమనీయం..రమణీయం

కృష్ణా యూనివర్శిటీలో విజయవంతంగా ముగిసిన కృష్ణాతరంగాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా యూనివర్శిటీలో శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు సాగిన యువజన ఉత్సవాలు ఆద్యంతం సందడి వాతావరణంలో సాగాయి. వర్శిటీలో ఏటేటా 'కృష్ణా తరంగాలు' పేరిట ఆనవాయితీగా జరిగే వేడుకలు ఈ సంవత్సరం కూడా ఉత్సాహంగా కన్నుల పండుగగా జరిగాయి. కృష్ణా యూనివర్శిటీలోని మూడు కళాశాలల విద్యార్థులతో పాటు యూనివర్శిటీ పరిధిలో జిల్లావ్యాప్తంగా ఉన్న దాదాపు 20 కళాశాలల నుండి 800 మంది విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. మొదటి రోజు జరిగిన భారతీయ కళలకు సంబంధించిన నృత్యాలు, జానపదాలు, మిమిక్రీ,శాస్త్రీయ సంగీత పదనిసలు, డ్రమ్స్ వాయిద్యం లాంటి వైవిధ్య భరిత కార్యక్రమాలతో వర్శిటీ ప్రాంగణమంతా పండగ వాతావరణం కనిపించింది. రెండోరోజున రంగోలి, కూచిపూడి నృత్యం, ఫొటో ఆర్ట్స్ లాంటి మొత్తం 27 రకాల కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమం అనంతరం ఉపకులపతి ఆచార్య కె.బి.చంద్రశేఖర్ విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. అన్ని రంగాల్లో కలిపి మొదటి విజేతగా విజయవాడ నుంచి పి.బి సిద్ధార్థ కళాశాల, ద్వితీయ స్థానంలో నలంద కళాశాల, తృతీయ స్థానంలో దుర్గా మల్లేశ్వరి కళాశాలలు నిలిచాయి. ఈ సందర్భంగా ఉపకలపతి ఆచార్య కె.బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ యువజన ఉత్సవాల వాతావరణంతో తెలుగువాళ్ళ అతిపెద్ద పండుగ సంక్రాంతి ముందే వచ్చిందా అన్నట్లు ప్రాంగణం అంతా దేదీప్యమానంగా ఉందన్నారు. చాలా తక్కువ సమయంలో ఇంత ఉన్నతంగా ఈ కార్యక్రమాలను తీర్చిదిద్దిన ఒక్కరికి పేరుపేరునా అభినందనలు తెలిపారు. అతి తక్కువ రిజిస్ట్రేషన్ ఫీజుతో విద్యార్థులకు ప్రవేశం కల్పించి వాళ్లకు రెండు రోజులపాటు భోజనం, వసతి సదుపాయాలు వర్శిటీ తరుపున కల్పించామన్నారు. అనంతరం వర్శిటీ రెక్టార్, యువజన ఉత్సవాల ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య డి.సూర్యచంద్రరావు మాట్లాడుతూ 2010 నుండి ఇప్పటివరకు వర్శిటీలో ఈ యువజనోత్సవ కార్యక్రమాల హోరు పెరుగుతూనే ఉందన్నారు. ఎక్కడా తగ్గలేదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రామిరెడ్డి మాట్లాడుతూ కృష్ణా జిల్లా అంటేనే కళలకు కాణాచి అని, దాన్ని వారసత్వంగా ముందుకు తీసుకెళ్లడానికి వర్శిటీ తరుపున శాయశక్తుల కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ కోటేశ్వరరావు,ఆచార్య వై కే సుందర కృష్ణ, ఆర్ట్స్, సైన్స్ ప్రిన్సిపల్ ఆచార్య వై.మారుతి తదితరులు పాల్గొన్నారు.


జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు



విద్యార్థులతో విసి కె.బి.చంద్రశేఖర్ తదితరులు



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

'నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్'లో కృష్ణాజిల్లా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ 30 వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్-2022, ఈ నెల 10 ,11 తేదీలలో తిరుపతి జిల్లాలోని గూడూరులో గల ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో జరిగింది.ఈ స్టేట్ లెవెల్ కాంపిటేషన్లో 26 జిల్లాల నుండి 182 ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము నుండి 17 ప్రాజెక్టను జాతీయస్థాయిలో పాల్గొనడానికి అర్హత సాధించాయి. కృష్ణాజిల్లా నుండి పి. దుర్గాభవాని, జిల్లా పరిషత్ హైస్కూల్లో తాళ్లపాలెం, మచిలీపట్నం మండలం తయారుచేసిన "ఇన్నోవేటివ్ మెడికేటెడ్ స్టిక్కర్" కు జాతీయ స్థాయికి ఎంపిక చేయబడింది. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు, సూచనలు, మార్గదర్శకత్వం చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు మహమ్మద్ వాహబ్, ప్రాజెక్టు రూపు కల్పనలో ఎంతో కషి చేశారు. ఈ ప్రాజెక్టు జాతి స్థాయికి ఎంపిక కాబడినందుకు కష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి తహెరా సుల్తానా అభినందించారు. కష్ణాజిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, ఎన్ సి ఎస్ సి,ఆప్కాస్ట్ ఎం. శ్రీనివాసరావు విద్యార్థి మరియు గైడ్ ఉపాధ్యాయులను అభినందించారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నంలోని కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాషా ఒక ప్రకటనలో తెలిపారు.

సమాజ చైతన్యంతోనే మతోన్మాదానికి అంతం

ప్రజాశక్తి-అవనిగడ్డ

సమాజంలో వేళ్లూనుకున్న మూఢవిశ్వాసాలు, మతోన్మాదాన్ని ఓడించాలంటే ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఆర్.రఘు సూచించారు. ఆదివారం భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో నాగాయలంకలోని శాంతి థియేటర్‌లో నిర్వహించిన ప్రజా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలకు మతం ఒక కారణమన్నారు. మతం సృష్టించిన కుల వ్యవస్థ ప్రజల మధ్య అంతరాలు సృష్టిస్తోందన్నారు. ఆ అంతరాలను స్వప్రయోజనాల కోసం రాజకీయ వ్యవస్థ పెంచి పోషిస్తోందన్నారు. ఈనాడు దేశంలో జాతీయ మతోన్మాదం పెచ్చు మీరిపోయిందన్నారు. దీన్ని ఆసరా చేసుకొని ప్రజల్ని మతోన్మాద భావోద్రేకంతో రెచ్చగొట్టి అధికారం చేపట్టడంతో పాటు దేశానికి పట్టుకొమ్మలుగా ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థ మూల సిద్ధాంతాలను సైతం ధ్వంసం చేయాలని పాలకులు చూస్తున్నారన్నారు. దీనికంతటికి ప్రజల్లో చైతన్యం లేకపోవడమే కారణమన్నారు. ఇందుకు కేవలం నాస్తిక వాదులు, హేతువాదులు ఒంటరిగా పోరాడితేనే సరిపోదని భౌతిక వాదులు కమ్యూనిస్టులుగా వారు కూడా మారాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ సైన్స్, సూడో సైన్స్ లపై అవగాహన కల్పించారు. సైన్సు సమాజాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలోకి నడిపిస్తోందీ, సూడో సైన్స్ ద్వారా మతోన్మాదులు ఏ విధంగా అసత్య ప్రచారాలు నిర్వహిస్తున్నదీ వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ అధ్యక్షత వహించారు. హైదరాబాదు భారత నాస్తిక సమాజానికి చెందిన జీడి సారయ్య నాస్తికత్వం ఆవశ్యకతపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమాన్ని భారత నాస్తిక సమాజం సభ్యులు బి.సుధాకర్ పరివేక్షించారు



మాట్లాడుతున్న ఆర్.రఘు

కొండాలమ్మ ఆలయానికి యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి ని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కానూరు సురేష్ బాబు తెలిపారు. రాష్ట్ర నలుమూల నుంచి పదివేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబలను తీర్చుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.


పూజల్లో పాల్గొన్న మహిళలు

రూ.25 వేలు తక్షణ సాయం అందించాలి : జనసేన

ప్రజాశక్తి-అవనిగడ్డ


మాండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు రక్షణ సాయంగా రూ.25 వేలు ప్రభుత్వం అందించాలని అవనిగడ్డ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గుడివాడ శేషబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తుఫాను వల్ల అశ్వరావుపాలెం, మోదుమూడి, దక్షిణ చిరుగాలంక, రామకోటి పురం గ్రామాల్లో తడిచి ముద్దయిన పంట పొలాలను పరిశీలించారు. దెబ్బతిన్న పంట పొలాలను పరివీలించారు. పనులన్నీ నీట మునిగిపోయాయని నాయకులు తెలిపారు. కోయకుండా ఉన్న వరి గాలులకు నేలవాలిందనానరు. ధాన్యం రోడ్లపై వర్షానికి తడిసిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. తేమతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు.


పంటను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో ఆరోగ్య శ్రీ పరిధిలో లేని 13 మంది రోగులకు ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నందుకుగాను ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 13 మంది రోగులకు రూ.8.99 లక్షల చెక్కులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చేతుల మీదుగా అందజేశారు. ఆదివారం అవనిగడ్డలోని పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేష్ బాబుతో కలిసి కృష్ణాజిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, గ్రామ ఉపసర్పంచ్ గాజుల జయ గోపాల్, పార్టీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ చింతలపూడి బాలు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

13న మినీ జాబ్ మేళా

మచిలీపట్నం అర్బన్ : భారత ప్రభుత్వం సంకల్ప్ పథకంలో భాగంగా ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఈఈడిఏపి, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త అధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యస్ శ్రీనివాసరావు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 13 వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని ఎంజిరోడ్డులోని ఖజానా జ్యువెలరీ షోరూంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు చెప్పారు. సేల్స్ ఎక్జిక్యూటివ్, క్యాషియర్ ఉద్యోగాలకు ఇంటర్, డిగ్రీ అర్హతని, నెలకు రూ 17 వేలు నుండి రూ 19 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. ఆఫీస్ బాయ్, హౌస్ కీపింగ్ అసిస్టెంట్ ఉద్యోగాలకు సుమారు రూ 14.5 వేలు వేతనంతో ఉద్యోగ అవకాశాలు నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలను ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://tlingurl.com/yofmakmthi లో తమ పూర్తి వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సదరు జాబ్ మేళాకు రెజ్యూమ్, బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో మంగళవారం ఉదయం 10 గంటలకు ఖజానా జ్యువెలర్స్ షోరూంకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 80743 70846 సంప్రదించాలని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు

యోజన కింద ప్రతినెలా క్షయవ్యాధిగ్రస్తులకు వ్యాధి నయం అయ్యేవరకు వైద్య పరీక్షలు, ఉచిత మందులతో పాటు పోషకాహార మద్దత్తు రూ. 500 అందిస్తుంది. క్షయవ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు రోగ నిర్ధారణ పరీక్షలు ఆరోగ్య కేంద్ర ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ ఉంటుంది. అయితే ప్రభుత్వం పౌష్ఠికాహారం మద్దత్తుతో పాటు అదనపు పౌష్ఠికాహారం అవసరం ఎంతైనా ఉంది.

ప్ర: ప్రభుత్వం నిర్వహిస్తున్న టీబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఏమిటి?

జ: కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి టీబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. అందులో నిక్షయ్ మిత్రలుగా నమోదు చేసుకుని, క్షయరోగుల పౌష్టికాహార పంపిణీలో భాగస్వామ్యం కావచ్చు.

ప్ర: జిల్లాలో అదనపు పౌష్ఠికాహారం సమకూర్చేందుకు ఏ విధంగా ముందుకెళ్తున్నారు?

జ: కృష్ణాజిల్లాలో 1480 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నారు. స్వచ్ఛందంగా సహాయం చేసేందుకు సంస్థలు, వ్యక్తులను ఆహ్వానిస్తున్నాం. గ్రూపుగా కానీ ఒక్కొక్కరిగా కానీ రోగులను దత్తత తీసుకునే వెసులుబాటు ఉంది. ప్రతినెలా వ్యాధిగ్రస్తులకు అదనకు పౌష్ఠికాహారం (ఫుడ్ బాస్కెట్) కొరకు రూ 600 అవుతుంది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 6 నెలలు పాటు అందించేందుకు ఎవరైనా సహకరించొచ్చు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది దాతలుకు సహకరిస్తారు. ఫుడ్ బాస్కెట్ గుప్త దానం చేయాలనుకునే దాతలు ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అందించొచ్చు. అదనపు పౌష్టికాహారం అందితే త్వరగా రోగులు కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మాకు సహాయం చేసేందుకు కొంత మంది ఉన్నారన్న భావం రోగులలో కలుగుతుంది. దీంతో సామాజిక రోగవేదన నుండి త్వరగా బయట పడతారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) గుడివాడ శాఖ స్వచ్ఛందంగా 28 మంది క్షయవ్యాధిగ్రస్తులకు దత్తతకు ముందుకు వచ్చింది.

ప్ర: దాతలు స్వయంగా ఫుడ్ బాస్కెట్ అందించేందుకు సౌలభ్యం ఉందా?

జ: గ్రూపుగా కానీ ఒక్కొక్కరిగా రోగులను దత్తతు తీసుకునే వెసులుబాటు కల్పించాం. స్వయంగా దాతలు రోగులకు ఫుడ్ బాస్కెట్ అందించేందుకు వెసులుబాటు ఉందన్నారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది సహకరిస్తారు. ఆర్థిక సహాయం చేయాలనుకునే దాతలు ముందుగా ఆన్లైన్లో నిక్షయ మిత్రులుగా పేరు నమోదు చేసుకుని జిల్లా లెప్రోసి, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ ఖాతా అకౌంట్ నెంబరు 042612010000894 నేరుగా నగదు జమచేయొచ్చు. రోగుల సహాయం కోసం సమాజంలోని అందరి ప్రమేయం కోరుతున్నాం.

జీవిత బీమా లక్షలాది కుటుంబాలకు ఆసరా



విధంగా చర్యలు చేపడుతున్నారన్నారు. ఎల్ఐసిని కూడా ప్రైవేటుకరించేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇలాంటి విధానాలను ఎదుర్కోవాల్సిన అవసరం కార్మికులు, ఉద్యోగులపై ఉందన్నారు. స్వాతంత్ర లక్ష్యం నేటికీ నెరవేరడం లేదన్నారు. ఇందుకు ప్రధాన కారణం పాలకులేనన్నారు. ఆకలి, పేదరికం మతోన్మాదం నుండి దేశాన్ని రక్షించుకోవాలని అందుకు ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకునేందుకు అందరం భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి పటిష్టతకు కారణమైన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసే కుట్రలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. పోరాటాలకు సిద్ధం కావాలనీ, తద్వారా ఎల్ఐసి లాంటి ప్రభుత్వానికి సంక్షేమానికి చేయూతనందించే సంస్థలను కాపాడుకోగలుగుతామని సతీష్ తెలిపారు. తొలుత అవనిగడ్డ పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు అనంతరం సభ నిర్వహించే ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద యూనియన్ జెండాను డివిజన్ అధ్యక్షులు జె.సుధాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతయ్య, మార్కెటింగ్ మేనేజర్ ఎం మధుసూదన్ రావు, అవనిగడ్డ బ్రాంచ్ మేనేజర్ జి ఉమామహేశ్వరరావు, జోనల్ జాయింట్ సెక్రెటరీ జి.కిషోర్ కుమార్, బీహెచ్ఈఎల్ రాధాకృష్ణ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ధనుంజయరావు, సిఐటియు నాయకులు శీలం నారాయణరావు, ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు ఎం.నిరంజనరావు, కొండవీటి కిషోర్, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, కోడూరు సత్యనారాయణ, ఇతర యూనియన్లు, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి, శ్రావణి కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. బ్రాంచ్ యూనియన్ నాయకులు పి.శ్రీనివాసరావు, టి.చంద్రపాల్, మల్లికార్జున ప్రసాద్ పర్యవేక్షించారు

నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జె.సుధాకర్, జి.కిషోర్ కుమార్

మచిలీపట్నం డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జె.సుధాకర్, జి.కిషోర్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం తొమ్మిది మందితో కమిటీ ఎన్నికైంది. జాయింట్ సెక్రెటరీగా సురేష్, టి.చంద్రపాల్, సిహెచ్ కళాధర్, ఉపాధ్యక్షులుగా ఎన్ఎంకె ప్రసాద్, కట్ట భాస్కర్, బి.ఫణేంద్ర, ట్రెజరర్లుగా ఎల్. రాజశేఖర్, అసిస్టెంట్ ట్రెజరర్ గా ఆర్ వి ఎన్ ఠాగూర్ ఎన్నికయ్యారు.

రైతుల కష్టం వర్షార్పణం

సడలిస్తేనే ఒకింత రైతులకు ఊరట కలుగుతుందంటున్నారు.

అపరాలు విత్తనాలు ఎలా?

ఖరీఫ్ వరి మాగాణుల్లో రబీలో అపరాలు, పెసర తదితర ఆరుతడి పంటలు సాగు చేస్తారు. వరి కోతలకు రెండు మూడు రోజులు ముందుగా పొలాల్లో ఎకరానికి 16 కిలోల నుంచి 20 కిలోల వరకు విత్తనాలు వెదజల్లుతారు. భూమిపై నీరు, తేమ ఎక్కువ ఉంటే ఈ అపరాలు మొక్కలు ఎర్రబారిపోతాయి. ఎదుగుదల లేక క్రమంగా చనిపోతాయి. ఇప్పటికే అత్యధిక విస్తీర్ణంలో రైతులు మినుము వెదజల్లారు. వర్షాలకు ఈ పంట దెబ్బతింది. ఈ నేపథ్యంలో రైతులు తిరిగి సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది.

జిల్లాలో 794 మిల్లీ మీటర్లు వర్షపాతం

అత్యధికంగా కోడూరులో 92.4 మిల్లీ మీటర్లు

మాండూస్ తుఫాను కారణంగా శనివారం నుండి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 794 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. సగటున ఒక్కో మండలంలో 31.8 మిల్లీ మీటర్లు నమోదైంది. అత్యధికంగా కోడూరు మండలంలో 92.4 మిల్లీ మీటర్లు నమోదైంది. మోపిదేవి 78.2, చల్లపల్లి 72.8, అవనిగడ్డ 71.6, మొవ్వ 67.8, ఘంటసాల 56.6, నాగాయలంక 53.2, పమిడిముక్కల 45.6, గూడూరు 35.2, మచిలీపట్నం 27.8, పెడన 26.6, తోట్లవల్లూరు 24.2, బాపులపాడు 19.6, కృత్తివెన్ను 18.2, వుయ్యూరు 14.8, కంకిపాడు 12.4, పామర్రు 12.4, గన్నవరం 11.4, నందివాడ 11.4, పెనమలూరు 9.2, గుడ్లవల్లేరు 9.2, ఉంగుటూరు 8.6, పెదపారుపూడి 5.6, బంటుమిల్లి 4.6, గుడివాడలో 4.6 మిల్లీ మీటర్లు నమోదైంది.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై క్రోమా ఆఫర్లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: టాటా గ్రూపుకు చెందిన క్రోమా ఎలక్ట్రానిక్, ట్రావెల్ ఉత్పత్తులపై ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు సంస్థ రీజనల్ ప్రతినిధి రాజశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. వింటర్ సీజన్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్స్, ట్రావెల్ అవసరాలను తీర్చేందుకు తమ సంస్థ ముందుంటుందని తెలిపారు. ఈసేల్స్ అన్ని షోరూమ్‌లలోనూ ప్రారంభించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, బ్లూ టూత్ స్పీకర్లు, ఏసీలు, పవర్ బ్యాంక్‌లు, ఎయిర్ ప్యూరిఫయర్లు, మరెన్నో విభాగాలపై ఆఫర్లు ఉంటాయని తెలిపారు. దగ్గరలోని ఏ స్టోర్‌కు వెళ్లినా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నామన్నారు.

గాయకులకు దుస్తులు పంపిణీ

గుడివాడ : క్రిస్మస్ నెలను పురస్కరించుకుని గాయక బృందానికి మెండా కిరణ్‌కుమార్ వితరణతో దస్తులు పంపిణీ చేడం అభినందనీయమాని అవిలాపూరి చిన్న తేరేజమ్మ దేవాలయం (ఆర్‌సిఎం) విచారణ గురువు



గాయకులకు దుస్తులు పంపిణీచేసిన పాస్టర్లు

ఎం.లూయిస్‌రాజు అన్నారు. ఆదివారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఆర్‌సిఎం గుడివాడ-2 చర్చిలో వైసీపీ నాయకులు మెండా కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాకారుల బృందానికి, వృద్ధులకు చీరలు, దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైసీపి నాయకులు వెంపటి సైమన్, మమిళ్ళ ఏలిశాతో కలిసి ఫాదర్ లూయిస్‌రాజు మాట్లాడారు. గత 10 సంవత్సరాలుగా కిరణ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గుడ్‌మెన్‌పేట విచారణ పరిధిలోని సుమారు 100 మంది వృద్ధులకు దుస్తులు పంపణీ చేయటం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఉపదేశకులు మేకతోటి మరియదాసు, డి.దానియేలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్థంభాలను పట్టుకోవద్దు : ఎఇ

ప్రజాశక్తి-గన్నవరం

మాండూస్ తుఫాన్‌తో కురుస్తున్న వర్షాలు, గాలులతో రైతులకు సంబంధించిన కొందరివి కరెంట్ మోటార్లు మునిగి వుంటాయని వాటికి ముట్టుకోవద్దని విద్యుత్‌శాఖ ఎఇ రాజు తెలిపారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ స్టార్టర్స్, డబ్బాలు తడిసివుంటాయని, సర్వీసెస్ వైర్స్ డామేజెస్, అవుతాయన్నారు. స్థంబాలు పడిపోవచ్చునని పేర్కొన్నారు. ఈదురుగాలులకు కరెంట్ వైర్లు తెగిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. వాటిని ముట్టుకునేందుకు, దగ్గరకు వెళ్లే ప్రయత్నం కానీ చేయొద్దని కోరారు. ఆక్వా రైతులు, ఏరియేటర్స్‌ను ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. ఇళ్లకు సంబందించిన సర్వీస్ వైర్లని కాని, వాటితో వేలాడే ఇనుప తీగలను కానీ, కరెంట్ స్థంభాలను కానీ,ఇనుప స్తంభాలను కానీ, లైన్స్ మీద చెట్టు కొమ్మలు పడిన కానీ, ముట్టుకొనే ప్రయత్నం చేయొద్దని కోరారు. ఇంట్లో నుండి బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్త, వాహనాలలో వెళ్ళేటప్పుడు జాగ్రత్త, అలాగే తడిచేతులతో ఇంట్లోని స్విచ్ బోర్డులను ముట్టుకోవద్దని కోరారు. విద్యుత్ షాక్‌తో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ధాన్యం మొలకెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మండల వ్యవసాయాధికారి శివప్రసాద్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మాండూస్ తుఫానుతో కురుస్తున్న అధిక వర్షాలకు రైతులు క్రింద తెలిపిన తగు చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం మండల వ్యవసాయాధికారి జి శివప్రసాద్ సూచించారు. పడిపోయిన వరి పైరు, కోసిన వరి పనలు నీటిలో మునిగిపోయి తడిస్తే గింజలు మొలకెత్తటం, రంగు మారటం, బూజు పట్టం లాంటివి జరుగుతాయని పేర్కొన్నారు. కంకులపై పడేటట్లు 5 కిలోల ఉప్పును 100 లీటర్ల నీటిలో కరిగించి ఆ ద్రావకాన్ని పనలు, కంకులపై చల్లాలని పేర్కొన్నారు. గింజలు మొలకెత్త కుండా ఉంటాయని వివరించారు. ఎకరం వరి పనలకు సుమారు 40-50 కిలోల ఉప్పు సరిపోతుందన్నారు. పనలు ఆరకుండా కుప్ప వేసేట ట్లైతే కుప్పలు వేసే సమయంలో వరసల పైన 5 శాతం ఉప్పు నీటిని పిచికారీ గానీ, చేతితో సమానంగా పడేటట్లు ఉప్పును చల్లి గాని ఆరనిస్తే 10-15 రోజుల వరకూ గింజ మొలకెత్తదని తెలిపారు. ప్రతి 100 కిలోల పైరు భాగాన 2 కిలోల ఉప్పు వరసలుగా చల్లుతూ కుప్ప వేస్తే తేమ త్వరగా పీల్చుకొని ధాన్యం, గడ్డి చెడిపోకుండా ఉంటుందన్నారు. కళ్లంలో తడిసిన ధాన్యం, వరిపైరు నూర్చేటప్పుడు వర్షాలు పడి ధాన్యం తడిసిన తరువాత 2-3 రోజులపాటు ఎండ పెట్టటానికి వీలుకానప్పుడు ఉప్పు ఊక కలిపి ధాన్యాన్ని పోగుపెట్టినట్లైతే ధాన్యం పాడవ్వకుండా నిల్వ చేసు కోవచ్చునని వివరించారు.

పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి

రాష్ట్రప్రభుత్వం తేమశాతంతో నిమిత్తం లేకుండా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మొత్తాన్ని కొనుగోలు చేయించాలని ఎపి రైతుసంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్‌చేశారు. బంటుమిల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారంనాడు ఆయన ధాన్యపు రాశులను సందర్శించి పరిశీలించారు. తేమశాతం పరిధి 17 నుండి 21 శాతం వరకు పెంచి రైతులను ఆదుకోవాలని కోరారు. పంట పొలాల్లో వరి పనలు, కుప్పలు, రాశుల రూపంలో ధాన్యం ఉందని వివరించారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పరిస్థితి లేకపోవటంతో తేమశాతం అధికంగా కనబడుతోందని వివరించారు. ప్రభుత్వం తేమశాతంతో నిమిత్తం లేకుండా రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని మొత్తాన్ని కొనుగోలు చేయించాలని కోరారు. కాటా వేసిన ధాన్యాన్ని వెంటనే రవాణాకు ఏర్పాట్లు చేయాలనీ, ఆర్.బి.కె వద్ద తీసిన తేమశాతాన్ని ఫైనల్‌గా మిల్లర్స్ కూడా ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రైతులకు గోనె సంచులు కొరత లేకుండా ఏర్పాటు చేయించాలన్నారు. ధాన్యం విక్రయించిన వారం రోజులకే రైతు ఖాతాలో డబ్బులు జమ చేయించే ఏర్పాటు చేయాలని కోరారు. తుఫాన్ ప్రభావానికి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న గౌరిశెట్టి నాగేశ్వరరావు తదితరులు

దెబ్బతిన్న, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులు, కౌలు రైతులని ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధనరావు , సుజ్ఞానం వినయ్, మహమ్మద్ అబ్దుల్లా , వంగల రాజా, రైతులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మించొద్దని నిరసన

ప్రజాశక్తి-గన్నవరం

ప్రజల ప్రాణాలకు హాని కలిగించే సెల్ టవర్ నిర్మాణం చేస్తే మేము అందరం ఇల్లు వదిలి వెళ్లి పోతామని, నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ తేలప్రోలు గ్రామంలో ఆదివారం స్థానికులు ఆందోళన జరిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రాణాలు బలి తీసుకునే టవర్ నిర్మాణం ఎలా నిర్మింస్తారని ప్రశ్నించారు. ఎవరికి సమాచారం తెలపకుండా ఏదో కరెంట్ స్తంభం వేస్తున్నామని ముగ్గురి వద్ద సంతకాలు తీసుకొని




నిరసనలో పాల్గొన్న తేలప్రోలు గ్రామస్తులు

టవర్ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. ఈ టవర్ నిర్మాణం చుట్టూ పక్కల ఉన్న ప్రజలు అందరూ ఏదో ఒక ఆరోగ్య సమస్యలు ఉన్నాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి,అధికారులు కలిసి కుమ్మక్కై ఈ టవర్ నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, అధికారులు స్పందించటం లేదని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి కి ఎన్ని సార్లు ఈ నిర్మాణం పై చెప్పిన పట్టించుకోలేదు. సెల్ టవర్ నిర్మాణం పక్కనే ఉన్న స్థల యజమానికి కూడా జరుగుతోందని తెలిపారు. సెల్ టవర్ నిర్మాణం చేస్తే తమ కుటుంబాలకు ఇళ్ల ఇల్లు వదిలి వెళ్లిపోవటం మినహా మరో గత్యంతరం లేదని తెలిపారు. సెల్ టవర్ రేడియేషన్‌తో అనారోగ్యం పొంచివుందనీ, ఆరోగ్య సమస్యలు వచ్చి తమ ప్రాణాలు పోకొట్టు కావాలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్పందన కార్యక్రమంలో కూడా సెల్ టవర్ వల్ల వచ్చే సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అధికారులు అందజేసినట్లుగా పేర్కొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలం దైవ సేవకుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కోడూరులోని సంత మార్కెట్ గ్రౌండ్స్‌లో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వర్తమానికులు



కోడూరులో

క్రైస్ట్ జీసస్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ జి.ఆర్. సిరిల్ ఖన్నా ఆత్మీయ అతిథులుగా అక్షయ డెవలపర్స్ స్వచ్ఛంద సంస్థ అధినేత మాదివాడ వెంకట కృష్ణ (క్రిస్టియన్), టిఎస్ఆర్ గ్రూప్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ క్రిస్మస్ కేకు కట్ చేసి పంపిణీచేశారు. భక్తులకు పంపించారు. మహిళలు సుమధుర గీతాలు ఆలపించారు. యేసు పుట్టుకను గురించి దైవ సేవకులు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పలు రాజకీయ నాయకులు, పెద్ద సంఖ్యలో దైవ సేవకులు, కోడూరు మండల నలుమూల నుంచి భారీ తరలి వచ్చారు.

నిరుపేదల అవసరాలు గుర్తించి వారికి అండగా నిలుస్తున్న ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఐవిఎం సంస్థలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఇండియా విలేజ్ సేవా సంస్థ డైరెక్టర్ వేములపల్లి సురేష్ బాబు ఆర్థిక సహాయం అందించినవిద్యార్థికి ల్యాప్ టాప్, వృద్ధులకు నూతన వస్త్రాలు దుప్పట్లు, చీరలు బాల బాలికలకు నూతన దుస్తులు బహుమతులు అందజేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైసీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అవనిగడ్డకు చెందిన పేద విద్యార్థినికి చింతా కృష్ణవేణికి లాప్ టాప్ బహుకరించారు.

ప్రతి నెలా ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ - రోజా దంపతు ఆర్థిక సహకారంతో నిత్యావసర సరుకులు, బియ్యం సహాయంగా పొందుతున్న పురిటిగడ్డ పరిసర పది గ్రామాలకు చెందిన వందమంది నిరుపేద వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు, చీరలు, వస్త్రాలు అందించారు. ఐ వి ఎం నూతన సంవత్సరం 2023 కాలెండర్ ను అతిథులు ఆవిష్కరించారు మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు, ఐవీఎం డైరెక్టర్లు వేములపల్లి విజయ, వేములపల్లి రోజా, వేములపల్లి స్వితిన్ రాస్, వేములపల్లి సోఫీ, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



చల్లపల్లిలో

ఘనంగా పిన్నమనేని బాబ్జీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ

ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్, టిడిపి



కేకును కట్‌చేస్తున్న బాబ్జీ

నాయకులు పిన్నమనేని బాబ్జీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం స్థానిక భాస్కర్ థియేటర్ ఆవరణలో అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జీ) జన్మదిన వేడుకలను బాబ్జి యువసేన నాయకుడు పైడిముక్కల వంశీ అధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను బాబ్జీ కట్ చేశారు. అనంతరం అభిమానులు ఆయన్ను పూలమాలలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ బ్యాంక్ డైరెక్టర్ మహ్మద్ ఖాసీం(అబూ), పాలడుగు ధర్మపాల్, చావ కాళీప్రసాద్, సుంకర రమణ, గడ్డం ప్రకాష్‌దాస్, షేక్ ఇబ్రహీమ్, కెడిసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ కిషోర్‌నాయుడు చేయూత

ప్రజాశక్తి-నాగాయలంక

అగ్ని ప్రమాద భాధితునికి శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ శ్యామ్ కిషోర్ చేయుతనందించారు. అవనిగడ్డ



దుస్తులు పంపిణీచేస్తున్న శ్యామ్‌కిశోర్‌నాయుడు

పంచాయతీలోని మూడో వార్డుకు చెందిన అవనిగడ్డ శ్రీనివాసరావుకు చెందిన గృహం శుక్రవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. గృహంలోని సామాన్లు అగ్నికి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న శ్యామ్ కిషోర్ ఆదివారం తన వంతు చేయుతనందించారు. నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, నూతన వస్త్రాలను శ్యామ్ కిషోర్ దంపతులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ వెంకటేశ్వరరావు, కోసూరి విజయ్ కుమార్, పావులూరి వెంకటేశ్వరరావు, నారేపాలెం శివ రామ కష్ణ, అవనిగడ్డ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలను పరిష్కరిస్తాం : అజ్మతుల్లా

ప్రజాశక్తి - పెనమలూరు,

మైనార్టీల సమస్యలను పరిష్కరిస్తామని ఆజాద్ ముస్లీం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆజ్మతుల్లా అన్నారు. ఆదివారం జన్మభూమి వంతెన సమీపంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ



నియామక పత్రాలను అందుకుంటున్న కమిటీ ప్రతినిధులు

సందర్భంగా అజ్మతుల్లా అధ్యక్షతన పెనమలూరు నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మహ్మద్ జహీరుద్దీన్, ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, షేక్ సత్తార్, ప్రధాన కార్యదర్శిగా షేక్ జక్రియ, సహాకార్యదర్శులుగా సుబహాన్, రహమతుల్లా, కోశాధికారిగా అన్వర్‌లను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రకమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్, కమిటీ పెద్దలు బాజి, గఫూర్ పాల్గొన్నారు.

నీటి మీటర్ల బిగింపు అప్రజాస్వామికం

ఎపి పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ బాబూరావు



విజయవాడ: మధురానగర్ పసుపుతోటలో వ్యక్తిగత, నివాస గృహాలకు నీటి మీటర్లు బిగించడాన్ని నిరసిస్తూ ఆదివారం ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. పౌర సంక్షేమ సంఘం, పసుపు తోట వెల్ఫేర్ అసోసియేషన్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు నీటి మీటర్లు తొలగించాలని, నీటి మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి పట్టణ పౌర సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సిహెచ్. బాబూరావు మాట్లాడుతూ 73 ,74 రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీటి మీటర్లు పెట్టాలని స్థానిక సంస్థలకు ఆదేశాలివ్వటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వంతో జతకట్టి మంచినీటి సరఫరాను కార్పొరేట్లకు కట్టబెట్టే రహస్య అజెండాతో ముందుకు వెళ్తుందన్నారు. ప్రజలకు సమాచారం ఇవ్వకుండా, చర్చించకుండా, ఏకపక్షంగా నగరపాలక సంస్థ నీటి మీటర్లు పెట్టడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు మొహం చాటేసి, నీటి మీటర్లపై సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ పాలకవర్గం నీటి మీటర్ల విషయంలో మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధుల ఇళ్లకు పెట్టని నీటి మీటర్లు, సామాన్యులకు మాత్రం పెట్టడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీటి మీటర్ల వల్ల మంచినీటి ఛార్జీలు పది రెట్లు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. నిధుల్లేవని చెప్పే ప్రభుత్వాలు, ఒక్కో ఇంటికి పది వేల రూపాయలు ఖర్చుపెట్టి నీటి మీటర్లు ఎందుకు పెడుతున్నారో చెప్పాలన్నారు. నగరపాలక సంస్థ పది రోజుల్లో నీటిమీటర్లను తొలగించకపోతే ప్రజలే తొలగిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రసాద్, ప్రజా సంఘాల నేతలు బి.రమణరావు, టి.ప్రవీణ్, పి.కృష్ణమూర్తి, సుందర్రామరాజు, నాగరాజు, రాము, గురుమూర్తి, రామానుజం, సాయిబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వచ్చే ఏడాది బేస్‌బాల్ సీనియర్ నేషనల్స్ టోర్నమెంట్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: వచ్చే ఏడాది విజయవాడలో బేస్‌బాల్ మహిళలు, పురుషుల సీనియర్ నేషనల్స్ నిర్వహించాలని తమ రాష్ట్ర సంఘం నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అసోసియేషన్ ఛైర్మన్ సాగి కృష్ణవైభవ్ తెలిపారు. అన్ని రాష్ట్రాల నుంచి 35 పురుష, మహిళా జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షుడు గుడివాడ రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణవైభవ్‌ను ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణవైభవ్ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కష్ణా జిల్లాలో ఏపీ రెండు జాతీయ స్థాయి టోర్నమెంట్లు నిర్వహిచామన్నారు. బేస్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా యూనిట్లను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది విజయవాడలో సీనియర్ నేషనల్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. బేస్ బాల్ ఫెడరేషన్, ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో అన్ని జిల్లాల్లో ఆటను అభివృద్ధి చేస్తామన్నారు. బేస్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, త్రిపుర ప్రభుత్వ సలహాదారు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, గేమ్ అభివృద్ధికి సహకారం ఇవ్వడానికి కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ సమ్మతి తెలిపారాన్నారు. బేస్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ, ఇండియన్ టీమ్ ఫస్ట్ కెప్టెన్ ఎల్ రాజేంద్ర, వైస్ ప్రెసిడెంట్ ఎంవి సత్యప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బేస్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ టి తులసీరావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోపీకృష్ణ, జాయింట్ సెక్రటరీ సివి ప్రతాప్, మహిళా జట్టు మాజీ కెప్టెన్ కిషోరి, ఫెడరేషన్ రిఫరీ టి శ్రీ లత, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ వై మురళి పాల్గొన్నారు.

విజయవాడలో నటి అర్చన సందడి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నగరంలో నటి అర్చన సందడి చేశారు. మహంకాళి మెటల్ మార్ట్ షాప్‌ను ఆమె ఘనంగా ప్రారంభించారు. షాప్‌లో ఉన్న వస్తువులను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,మహంకాళి మెటల్ మార్ట్ ప్రరంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తాను కూడా అంటిక్ కలెక్షన్ చేస్తానని అన్నారు. షాప్ లో మేటల్ వస్తువులు చాలా నాణ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. షాప్ లో ఉపయోగించిన బ్రాస్ క్వాలిటీ చాలా నాణ్యంగా ఉన్నాయనీ పేర్కొన్నారు. హై క్వాలిటీ స్టాండర్డ్స్ తో వస్తువులు చాలా అందంగా ఉన్నాయని స్పష్టం చేశారు. తనకు షాపులో అష్ట లక్ష్మి, దశావతారం,కప్ అండ్ సాసర్ వస్తువులు చాలా నచ్చాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని బ్రాంచులు స్థాపించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం షాప్ అధినేత గిరి ప్రసాద్ మాట్లాడుతూ, తమ షాపులో ఇత్తడి రాగి కి సంబంధించిన అన్ని వస్తువులు నాణ్యమైన క్వాలిటీతో అందుబాటులో ఉందని తెలిపారు. వస్తువులు హెూల్ సేల్ రేట్లకే ప్రజలకు అందిస్తామని ఆయన అన్నారు.



'గాన గంధర్వ సంగీత మణిహారం' పోస్టర్ ఆవిష్కరణ



విజయవాడ: తెలుగు భాష, సంగీతానికి సరిహద్దులు ఉండవని, ఎల్లలు దాటి నిత్యనూతంగా వెల్లువిరిసే తెలుగుదనపు సంగీత వికాసానికి ప్రవాసాంధ్రులూ తమవంతు కృషి చేస్తున్నారని అతిధులు కొనియాడారు. శాస్త్రీయ, లలిత, సినీ సంగీతరంగంలో అమెరికాలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రముఖ గాయని, నాద వినోద మ్యూజిక్ అకాడమీ (యుఎస్‌ఎ) వ్యవస్థాపకులు మణిశాస్త్రి సమర్పణలో జనవరిలో నిర్వహించే సినీ, సంగీత కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం స్థానిక ఎంబికె విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు మాట్లాడుతూ అమెరికా లాంటి దేశాల్లో భారతీయ సంగీతానికి ముఖ్యంగా సినీ, లలిత సంగీతాన్ని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చిన నిన్నటి తరం ప్రవాసాంధ్రుల్లో గాయని మణిశాస్త్రి ఒకరన్నారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ తెలుగు వెండితెరపై సుస్థిరంగా నిలిచిపోయే పాటలెన్నో ఉన్నాయని, సాహిత్యం, సంగీతం మేళవింపుగా సాగే ఆణిముత్యాల్లాంటి పాటల్ని ఇప్పటితరం వారికి, ముఖ్యంగా ప్రవాసాంధ్ర యువతరానికి అందించే విషయంలో మణిశాస్త్రి కృషి అభినందనీయమన్నారు. గాయని మణిశాస్త్రి మాట్లాడుతూ వ్యక్తిగతంగా ఈ నగరంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, సాంస్కృతిక కేంద్రంగా పేర్కొనే విజయవాడ వేదికపై సంగీత విభావరి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. చంద్రతేజ, వినోద్‌బాబు, శేషుకుమారి వంటి సీనియర్ గాయనీగాయకులు తనతో కలిసి పాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమధుర కళానికేతన్ బాధ్యులు భాస్కరశర్మ, తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ నిర్వాహకులు డివి రాజు, గంగాధర్ ఫైన్ ఆర్ట్ అకాడమీ ప్రతినిధి అంజుశ్రీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : సిపిఎం

విజయవాడ: జిల్లాలో ధాన్యం కొనుగోలును ప్రభుత్వం వేగవంతం చేయాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ జిల్లా కలెక్టర్ డిల్లీరావును ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయని, వరి పంట ఆరే పరిస్థితి కనపడటంలేదని, ప్రభుత్వం పచ్చిగా ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో తుపాను కారణంగా వరి సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని ప్రకటనలు చేస్తున్నా, ఇప్పటికీ జిల్లాలోని ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులను ఆసరాగా తీసుకుని ప్రైవేటు వ్యాపారస్తులు ధరలు తగ్గించి కొంటున్నారని, ఈ దశలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయించి రైతాంగాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

సైన్సు పోటీలకు దశిత ఎంపిక



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ జాతీయ స్థాయి పోటీలకు ఎన్‌టిఆర్ జిల్లా విద్యార్థిని డి. దశిత ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.హుస్సేన్ ఒక ప్రకటలనో తెలిపారు. ఈనెల 10, 11 తేదీలలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో నగరంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థిని జి. దశిత ప్రతిభ కనపరచడంతో జాతీయస్థాయికి ఎంపికైందని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక విద్యార్థిని అభినందించారు. అలాగే తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి రోజా విద్యార్థినిని అభినందించారని తెలిపారు.

15 నుండి భవానీ దీక్షల విరమణ : ఇఒ


సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ భ్రమరాంబ

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఈ నెల 15వ తేదీ నుండి 19వ వరకూ నిర్వహించనున్న భవానీ దీక్షా విమరణలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధిరి దర్భముళ్ళ భ్రమరాంబ తెలిపారు. ఆదివారం దేవస్థానం మహా మండపం ఆరవ అంతస్తులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇఒ మాట్లాడుతూ మొదటి రోజు 15న ఉదయం ఆరు గంటలకు అమ్మవారి దర్శనం అనంతరం 6.30 గంటలకు హోమగుండములు అగ్ని ప్రతిష్ఠాపన జరుగునని తెలిపారు. 19వ తేదీ ఉదయం 10 గంటలకు మహాపూర్ణహుతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు వినాయక గుడి నుండి ప్రారంభమయ్యే క్యూలైన్ల ద్వారా ఘాట్ రోడ్ మీదుగా దేవస్థానం చేరుకొని, అమ్మవారిని దర్శించుకొని, శివాలయం మెట్ల మార్గం ద్వారా క్రిందకి చేరుకోవాలని తెలిపారు. అక్కడ మూడు హోమగుండాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. యాత్రికుల సౌకర్యార్థం రూ.100, రూ.300, రూ.500 టికెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్యాకెట్ల రూపంలో అన్నదానం జరుపుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. లడ్డూ ప్రసాదం కొరకు కనకదుర్గానగర్ నందు పది కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే బస్టాండ్, రైల్వే స్టేషన్ నందు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 20 లక్షల లడ్డూలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. యాత్రికుల కొరకు మూడు ప్రదేశాలు సీతమ్మవారి పాదాలు, భవానీ ఘాట్, పున్నమి ఘాట్‌లలో మూడు షిఫ్ట్‌లలో మొత్తం 800 పైగా నాయీ బ్రాహ్మణులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. సీతమ్మవారి పాదాలు, భవానీ ఘాట్, పున్నమి ఘాట్‌ల యందు స్నానాల కోసం 800 షవర్స్ ఏర్పాటు చేయనున్నామన్నారు. పాదరక్షలు, లగేజీ వంటివి వీఎంసీ వారి ద్వారా ఉచితంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఎంఅండ్ హెచ్ఓ అలాగే ప్రైవేటు ఆసుపత్రుల ఆధ్వర్యంలో 20 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయుటకు ప్రపోజల్ చేశామని తెలిపారు. ప్రస్తుత 200 సీసీ కెమెరాలతో పాటు అదనంగా 57 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కలెక్టర్ కార్యాలయం, కంట్రోల్ రూమ్, మోడల్ గెస్ట్ హౌస్‌ల నుండి నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసశాస్త్రి, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్లు కె.వి.ఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, సహాయ కార్యనిర్వాహణ అధికారి పి.సుధారాణి, ఎన్.రమేష్, బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.